ప్రజాశక్తి

శనివారం 26 ఏప్రిల్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

ఉగ్రవాదాన్ని అరికట్టడంలో

కేంద్ర ప్రభుత్వం విఫలం

సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం విమర్శించింది. కాశ్మీర్, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల అమానుష దాడులను యావత్ ప్రపంచమంతా ఖండించాలని పిలుపునిచ్చింది. ఉగ్ర దాడిని ఖండిస్తూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఒంగోలులో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాగర్ హోటల్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు, కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో 28 మంది మరణించడం బాధాకరమన్నారు. మరణించిన వారికి సిపిఎం సంతాపాన్ని తెలియజేస్తోందన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. లష్కరే తోయిబా ఉగ్రవాదులు గత నెల రోజుల క్రితమే దాడి చేయడానికి ప్రయత్నిస్తారని నిఘా వర్గాలు హెచ్చరించినప్పటికీ పర్యాటకులకు భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ▶ 2లో

పాత పద్ధతిలో

అదనపు పించన్ ఇవ్వాలి

8లో ▲

వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితులుగా అనుమానిస్తున్న వారు బైక్‌పై వెళుతున్న దృశ్యాలు (సిసి ఫుటేజీలో రికార్డయినవి..), రక్తపు మరకలతో ఉన్న స్కూటీ

వీరయ్యచౌదరి హత్య కేసులో

దర్యాప్తు ముమ్మరం

- అమ్మనబ్రోలులో ఎస్పీ దామోదర్ విచారణ
- చీమకుర్తి వద్ద రక్తపు మరకలతో ఉన్న స్కూటీ స్వాధీనం
- పోలీసుల అదుపులో నిందితులు?

అమ్మనబ్రోలులో విచారణ చేస్తున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, చీమకుర్తి

మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరిని హత్య చేసిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. ముమ్మరంగానే దర్యాప్తు జరుగుతోంది. ప్రధాన సూత్రధారులు ఎవరన్న దానిపై ఇంకా స్పష్టత రాకపోయినా అమ్మనబ్రోలు కేంద్రంగా విచారణ వేగవంతమైంది. నిందితులుగా అనుమానిస్తున్న కొందరిని శుక్రవారం అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. కొందరిపై పోలీసుమార్క్ విచారణ నడుస్తోంది. బయట ప్రాంతాలకు కూడా పోలీసు బృందాలు వెళ్లి విచారణ చేస్తున్నాయి. మరో వైపు జిల్లాలో అంటే నాగులుప్పలపాడు మండలంలో వీరయ్యతో విభేదాలున్న వారిపైనా నిఘా పెట్టారు. పలువురిని ఇప్పటికే అదుపులోకి తీసుకొని విచారించారు. ఉప్పుగుండూరుకు చెందిన ఓ యువ నేతను ఇప్పటికే అదుపులోకి తీసుకొని అతనిని అన్ని విధాలా విచారణ చేస్తున్నారు. వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలుకు చెందిన కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించారు. శుక్రవారం నాడు ఎస్పీ దామోదర్ మరోసారి అమ్మనబ్రోలు గ్రామానికి వెళ్లారు. ఒకరిపై అనుమానం రావడంతో అతని కోసం వెళ్లినట్లు సమాచారం. అక్కడ పలు కోణాల్లో ఎస్పీ విచారణ చేపట్టారు. గ్రామంలో అతనితో ఎవరికి ఎలాంటి విభేదాలున్నాయనే దానిపై పరిశీలన చేస్తున్నారు. అన్ని కోణాల్లో సమాచారం సేకరిస్తున్నారు. ఇక చీమకుర్తి వద్ద ఓ డాబా సమీపంలో స్కూటర్ ఒకటి పోలీసులకు ▶ 2లో

మిమ్మల్ని పిలిపించింది..

మీరు చెప్పే కథలు వినడానికా.?

- పారిశుధ్య సమస్యల పరిష్కారంపై దృష్టి ఏదీ?
- విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించను
- పంచాయతీరాజ్ అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా హెచ్చరిక

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'మీరు చెప్పే కథలు వినడం కోసం మిమ్మల్ని పిలిపించానా.? క్షేత్ర స్థాయిలో పారిశుధ్య సమస్యల పరిష్కారంపై ఎందుకు దృష్టి సారించట్లేదు.? ఏ పని చేయడం కోసం ప్రభుత్వం మీకు జీతాలు ఇస్తోంది.? విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎంత మాత్రం సహించబోను' అని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా హెచ్చరించారు. శుక్రవారం పంచాయతీ రాజ్ అధికారులతో ప్రకాశం భవనంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. చెత్త తరలించేందుకు రిక్షాలు, క్లాప్ మిత్రలు, తాగు నీరు వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం, క్లోరినేషన్, రోడ్ల వెంట చెత్త కుప్పల తొలగింపు వంటి అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సమావేశానికి పెద్దారవీడు ఈఒపిఆర్‌డి హాజరు కాకపోవడంపై తీవ్రంగా స్పందించారు. తన అధ్యక్షతన సమావేశం ఉన్నప్పటికీ ఎందుకు రాలేదని డిపిఒ జి. వెంకట నాయుడుని కలెక్టర్ ప్రశ్నించగా.. తనకు కూడా ఎలాంటి సమాచారం లేదని ఆయన తెలిపారు. దీంతో ఈఒపిఆర్‌డికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎర్రగొండపాలెం ఈఒపిఆర్‌డి రాకపోవడంపై కలెక్టర్ ప్రశ్నించగా స్థానికంగా వేరే కార్యక్రమం ఉండటంతో తాను అనుమతి ఇచ్చానని ఎర్రగొండపాలెం ఎంపిడిఒ చెప్పగా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఒపిఆర్‌డి, ఎంపిడిఒలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తే, కనీసం తన దృష్టికి తీసుకురాకుండా ఈఒపిఆర్‌డికి మీరు ఎలా గైర్హాజరుకు అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. యర్రగొండపాలెం ఎంపిడిఒకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జడ్పీ సిఈఒను కలెక్టర్ ఆదేశించారు. చెత్త తరలించడానికి రిక్షాల సమస్య ఉందని, నెలకు రూ.6 వేల జీతానికి క్లాప్ మిత్రాలు ▶ 2లో

వీరయ్యచౌదరి హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

దొరికింది. దీనిపై రక్తం మరకలు ఉన్నాయి. హంతకులు వినియోగించినట్లుగా అనుమానిస్తున్నారు. అది ఎవరిది అనే కోణంలో విచారిస్తున్నారు.. నిజంగా ఈ స్కూటర్‌ను హంతకులు వినియోగించారా? లేదా? అన్న దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పోలీసు యంత్రాంగం మొత్తం ఇదే పనిలో నిమగ్నమై ఉంది. తెరచాటు పాత్రధారులపైనే ఎక్కువగా నిఘా పెట్టారు. ఇప్పటి వరకూ పోలీసులు విచారించిన వారంతా వీరయ్య చౌదరితో రాజకీయంగానూ, రేషన్, మద్యం వ్యాపారాల్లో అప్పుడప్పుడూ విభేదాలు, చిన్నచిన్న గొడవలు జరిగిన వారే ఉన్నారు. ఎక్కువ మంది నాగులుప్పలపాడు మండలానికి చెందినవారే కావడం గమనార్హం. వివాదాస్పద భూములు కొన్న వ్యవహారాల్లో పెద్దఎత్తున పేచీలు ఉన్నాయని తెలిసినా ఆ కోణంలో ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు. నిందితులుగా అనుమానిస్తున్న వ్యక్తులు బైకులపై వెళ్లడం కొన్నిచోట్ల సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఈ దిశగా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్రం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

దుయ్యబట్టారు. ఉగ్రవాద చర్యలు అణచడానికి తీసుకున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయన్నారు. భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. ఆర్టికల్ 371, 35ఎ రద్దు చేస్తే ఉగ్రవాద ఘటనలు జరగకుండా ఆగిపోతాయని ప్రజలను మభ్యపెట్టి కాశ్మీర్లో కార్పొరేట్లకు భూములు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ రాబోయే పశ్చిమ బెంగాల్, బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మరణించిన వారి కుటుంబాలు ఓదార్చే ప్రయత్నాలు మాని స్వార్థ రాజకీయాలకు ఘటనను ఉపయోగించటం దారుణమన్నారు.

మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని హితవు పలికారు. హిందూ ముస్లింలు ఐక్యంగా ఉగ్రవాద దాడులను ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.రమాదేవి, కాలం సుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, నగర నాయకులు జి.ఆదిలక్ష్మి, టి.మహేష్, పార్టీ సీనియర్ నాయకులు దామా శ్రీనివాసులు, మారెళ్ళ సుబ్బారావు, పార్టీ నాయకులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

మీరు చెప్పే కథలు వినడానికా.?

(మొదటిపేజీ తరువాయి)

పనిచేయడం లేదని పలువురు ఈఒపిఆర్‌డిలు చెప్పగా... రిక్షాల సమస్య పరిష్కారానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా.? ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఏమైనా దృష్టి సారించారా.? ఉన్నతాధికారులతో మాట్లాడారా.? అలాంటి చర్యలు ఏమైనా తీసుకుంటే చెప్పండి.? వాటిపై ఆలోచించకుండా ఇక్కడకు వచ్చి ఈ కథలు ఎందుకు చెబుతున్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇందుకోసమా మిమ్మల్ని ఇక్కడకు పిలిపించింది.. క్షేత్ర స్థాయిలో మీరు ఉండి ఏం పని చేస్తున్నారు?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లాప్ మిత్రాలకు ఇచ్చే వేతనాలను స్థానిక వనరుల నుంచే సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. తమ పరిధిలోని సమస్యలపై ఎంపిడిఒలు, డిఎల్‌పిఒలు దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశ అజెండా ముందుగానే చెప్పినప్పటికీ సరిగ్గా సన్నద్ధం కాకుండా మొక్కుబడి సమాధానాలు చెప్పడానికి వచ్చారా? అని కలెక్టర్ ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇండికేటర్స్‌లో జిల్లా స్థానం పేలవంగా ఉంటే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాలశంకర్‌రావు, డిపిఒ జి.వెంకట నారాయణ, డిఎల్‌పిఒలు, ఎంపిడిఒలు, ఈఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని నిరసస్తూ..

మార్కాపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జమ్ము కాశ్మీర్‌లోని పెహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ముస్లిం సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక కంభం సెంటర్లోని ముస్లిం షాదిఖానా నుంచి ప్రారంభమైన ర్యాలీ గడియార స్తంభం, దోర్నాల బస్టాండ్ మీదుగా కోర్టు సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా కంభం సెంటర్‌లో చేపట్టిన మానవహారాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ అమాయకపు పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని జరిగిన ఈ దాడి దేశ భద్రతకు పెను సవాలు విసురుతోందని, ఇలాంటి చర్యలను యావత్తు సమాజం ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. ఉగ్రదాడిలో అశువులు బాసిన కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దాడులు పునరావృత మవుతున్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం రక్షణ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తూ, గత కొద్ది సంవత్సరాలుగా త్రివిధ దళాల్లో ఖాళీలను స్థానాలను భర్తీ చేయట్లేదన్నారు. కాశ్మీర్ ప్రజలు ఎంతో సౌమ్యులని, పర్యాటకులను అతిథులుగా చూసే మనస్తత్వం వారిదని అన్నారు. ఈ ఘటనకు మతోన్మాద రంగు పులమడానికి ప్రయత్నించిన కార్పొరేట్ మీడియాల దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తూ ఉగ్రవాదులను ఎదిరించి వాళ్ల తుపాకులకు అడ్డుపడి, ఎంతగానో పోరాడి ప్రాణాలు కోల్పోయిన పహల్గామ్ స్థానికుడు సయ్యద్ ఆదిల్ హూస్సేన్ షా ధీరత్వానికి ఉగ్రవాదులకు కనువిప్పు కావాలని అన్నారు. అనంతరం పెహల్గాం మృతుల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘా లతో పాటు ప్రజా సంఘాలు, తెలుగుదేశం, కాంగ్రెస్, జనసేన, వైసిపి నాయకులు, అన్ని మసీదులకు చెందిన ముతవల్లీలు, ముస్లిం సంఘాలకు చెందిన అనుబంధం సంస్థలు జేఐహెచ్, ఎస్ఐఓ, ఐవైఎం, ఎమ్‌హెచ్‌పిఎస్, ఎంపీజే నాయకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ముస్లిం, ప్రజా సంఘాల, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు

కంభంలో ముస్లిముల ర్యాలీ

ప్రజాశక్తి-కంభం రూరల్

కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో శుక్రవారం ప్రార్థనల అనంతరం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జామియా మసీదు నుంచి, చౌక్ సెంటర్, నాయక్ వీధి మీదుగా కంభం బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పట్టణంలోని పలు మసీదుల నుంచి ముస్లిములు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని ఇస్లాం మతం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అమాయకులపై అన్యాయంగా దాడులు చేయడాన్ని ఏ మతమూ సహించదని ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు ఖండించారు. ఈ దాడులకు పాల్పడిన వారు ఏ మతానికి చెందిన వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మలేరియా నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పమిడి హరిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిణి వివరించారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని డాక్టర్ హరిణి కోరారు. దోమకాటు పెనుముప్పని ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలని ఆమె తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ట్యాంకులు, నీటి తొట్లను పరిశుభ్రపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రశాంత్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్ ప్రసాద్, వైద్యారోగ్య శాఖ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, వీరమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఆర్డీఏ వెలుగు పీడీ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

జిల్లా గ్రామీణాభివృద్ధి వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ శుక్రవారం గిద్దలూరు వచ్చి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిశారు. ఆయనకు శాలువా, పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ప్రాజెక్ట్ అంశాలు ప్రభుత్వం ద్వారా అమలు జరిగే సంక్షేమ కార్యక్రమాలు, డ్వాక్రా మహిళకు అందించే వివిధ పథకాలు, షేడ్ నెట్స్, సబ్సిడీ రుణాలు తదితర అంశాలపై ఎమ్మెల్యేతో చర్చలు జరిపారు. పీడీ వెంట గిద్దలూరు క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ కే లక్ష్మిరెడ్డి ఉన్నారు.

CHANGE OF NAME

I, **DIVI SRINIVASARAO** (Old name), S/O **DIVI VENKATARAO** resident of H.No.9-30, Marripudi Bazar, Alakurapadu Village, Tangutur Mandal, Prakasam District-523274 Andhra Pradesh, I, have Changed my name as **DIVI SRNIVASULU** (New Name) S/O **DIVI VENKATARAO** Hereafter my name is known as **DIVI SRNIVASULU** (New Name) S/O **DIVI VENKATARAO**

నోటీసు

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి వారి కోర్టులో, ఒంగోలు

ఓ.ఎస్.నెం. 408/2023

మధ్యలో :-

మొలకలపల్లి లక్ష్మీనారాయణ ...వాది

మరియు

గుడ్డపాతల సుబ్బారావు (లేటు), వగైరాలు ...ప్రతివాదులు

టు:

(D-2) - గుడ్డపాతల సుబ్బులు భర్త వెంకటేశ్వర్లు
(D-3) - గుడ్డపాతల సౌమ్యశ్రీ తండ్రి సుబ్బారావు
D-2 & D-3 both are R/o. ఏడుగుండ్లపాడు గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా.

పై నంబరులో పిటీషనరు D-1 కు వారసులుగా మిమ్ములను చేర్చమని కోరుచూ పిటీషను దాఖలు చేయగా సదరు పిటిషన్‌లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ ముట్టనందున ఈ పేపరు ద్వారా నోటీసు ఆర్డరు చేసినారు. పై నంబరులో మీ హాజరు నిమిత్తం తేది 28.04.2025న వాయిదా అయినది. సదరు వాయిదా రోజున పై కోర్టులో ఉదయం 10:30 ని॥లకు హాజరై మీ ఆక్షేపణలు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమున పిటీషను తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా:- 28.04.2025,
ఉదయం 10:30 ని॥లకు

ఇట్లు
బండారు శ్రీనివాసరావు
పిటీషనరు తరపు న్యాయవాది,
శ్రీ జ్యోతి స్వరూప కాంప్లెక్స్,
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు.
సెల్ నెం : 9849588504.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.యస్. నెం. 520/2024

బిట్వీన్:

నర్రావుల కమలాదేవి .... వాది

మరియు

శీంద్ర శశికాంత్ .... ప్రతివాది

టు :

ప్రతివాది :

శీంద్ర శశికాంత్, తండ్రి అశోక్, అమర్తలూరు గ్రామం, అమర్తలూరు మండలం, బాపట్లజిల్లా.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టువారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పై దావాలో నోటీసులు జారీ చేసిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ దావాను ది. 08-05-2025 వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 08-05-2025

వెలినేని రాఘవయ్య,
వాది తరపు అడ్వకేట్,
తెనాలి, గుంటూరుజిల్లా.

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెంబర్ : 192/2024

కందుల తిరుపతమ్మ ...వాది

వర్సెస్

కోలా యల్లమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు

TO,

1. కోలా యల్లమ్మ, భర్త చిన్న నరసయ్య (లేట్) @ చిన నరసయ్య, 50సం॥ వ్యవసాయం.
2. కోలా శ్రీమన్నారాయణ, తండ్రి చిన్న నరసయ్య (లేట్) @ చిన నరసయ్య, 27సం॥ హిందూ, బేల్దారి.
3. కోలా వెంకట నారాయణ, తండ్రి చిన్న నరసయ్య (లేట్) @ చిన నరసయ్య, 25సం॥ హిందూ, ప్రైవేటు ఉద్యోగం.
4. కోలా నవీన్, తండ్రి చిన్న నరసయ్య (లేట్) @ చిన నరసయ్య, 23సం. ప్రైవేటు ఉద్యోగం.

వీరందరిదీ చిమట గ్రామం, మర్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా.

అనువారికి పై నెంబరు దావాలో బాకీ వసూలు నిమిత్తం వాది, మీ మీద దావా దాఖలు చేసినందున నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకు నోటీసులు పంపించిననూ మీకు జారీ కానందున శ్రీ కోర్టు వారు నీ నోటీసు నిమిత్తం వాయిదా తే.28-04-2025ది న అయిఉన్నది. కావున పై తేదీన ఉదయం గం.10-30 ని॥లకు నీవు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో నీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ :28-04-2025
పొదిలి
తేదీ:25-04-2025

ఇట్లు
ముల్లా ఖాదర్ వలి,
వాది తరపు న్యాయవాది,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ : 9704764886.

మలేరియా వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తపట్నం

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియాను అంతం చేయాలని కోరుతూ ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ సూపర్ వైజర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఇతరులకు తెలియజేస్తానని, ప్రతి ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటామని, మలేరియా లక్షణాలు వచ్చినప్పుడు వెంటనే వైద్య సేవలు తీసుకునేట్లు తెలియజేస్తానని, మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తానని, మలేరియా రహిత సమాజానికి కషి చేస్తామని, సురక్షితమైన జీవితం ఆరోగ్యకరమైన సమాజమే కర్తవ్యంగా పనిచేస్తానని ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య దీపిక , సూపర్ వైజరు ప్రభాకర్, జి.సులోచన రాణి, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : మలేరియా వ్యాధి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుగుణ కుమార్ తెలిపారు.ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుగుణ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు పి హెచ్ఎన్ఎమ్. సంపూర్ణ దేవి, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సస్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పిసిపల్లి : జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి వైద్య బందం మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఎన్.యశిత మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చునని తెలిపారు. ఆడ ఎనాఫిలిస్ దోమలుతో మలేరియా, ఆడ క్యూలెక్స్ దోమలతో బోధకాలు, ఇడిఎస్ దోమలతో డెంగ్యూ లాంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమలను నివారించేందుకు ప్రతి ఒక్కరు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ తెరలను వినియోగించాలన్నారు. తొలుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు.అనంతరం మానవ హారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఇఒ రేణుక, సంధ్య, జక్కరయ్య, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.


కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొండపి : దోమలు వృద్ధి చెందకుండా, దోమ కాటుకు గురికాకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. అనూష తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా పెట్లూరు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ దోమల బారి నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలన్నారు. జ్వరాలు వచ్చిన వారు తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహం, కాంతారావు, ఎంఎల్‌హెచ్‌పిలు,ఆశా వర్కర్లు,వైద్యశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శింగరాయకొండ : శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చైతన్య కష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కందుకూరు రోడ్డు కూడలి వద్ద నుంచి శాంతి సినిమా హాలు వరకూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ధీరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీరయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, డిప్యూటీ పారామెడికల్ అధికారి దామా వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి భాస్కర్, విజయమ్మ, సంపూర్ణమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టంగుటూరు : పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా వ్యాధిని అంతం చేయవచ్చునని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అశోక్ అన్నారు. ప్రపంచ మలేరియా ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ బాలాజీ అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులన్నారు. దోమ కాటు నివారించడానికి దోమ తెరలను వినియోగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. నీటి నిల్వలు దోమలకు నివాసాలని తెలిపారు. వేపాకు పొగ పెడితే దోమలు పారిపోతాయన్నారు. మలేరియా ఒకరి నుంచి మరోకరికి సంక్రమించే అంటు వ్యాధి అని తెలిపారు. చలి, వణుకు కూడిన జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ జయలక్ష్మి, సిహెచ్ఒ మాతయ్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జరుగుమల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కావ్య, డాక్టర్ కావ్యశ్రీ, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాదికారి డాక్టర్ కావ్యశ్రీ మాట్లాడుతూ మలేరియా వ్యాధి నిర్మూలన మన చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు : ప్రాణాంతక జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ శ్రావణ్ కుమార్ అన్నారు. మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వలన వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి ప్రాణాంతక జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ మోహన్, హెల్త్ సూపర్ వైజర్ బాలకోటయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

పిసిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మహిళకు గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

రోడ్డు దాటుతున్న మహిళలను లారీ ఢీకొన్న ఘటనలో త్రీవ గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని శానంపూడి రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. కావలి వైపు నుంచి ఒంగోలు వైపుకి వెళుతున్న రోడ్డు దాటుతున్న లారీ గుర్తు తెలియని మహిళను ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రురాలిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు ఆమె విషమంగా ఉన్నట్లు అక్కడి వైద్యులు చెబుతున్నారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉత్తమ అవార్డు అందుకుంటున్న కూడలి అరుణ

ఉత్తమ సర్పంచిగా కూడలి అరుణ

ప్రజాశక్తి- హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ సర్పంచి కూడలి అరుణ దశరథ ఉత్తమ సర్పంచిగా ఎన్నికయ్యారు. తిమ్మారెడ్డిపల్లి గ్రామాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తు ప్రజలకు అందు బాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న అరుణ దశరథ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సందర్భంగా ఉత్తమ సర్పంచిగా అవార్డు అందుకున్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక చైర్మన్ నూకసాని బాలాజీ, పంచాయతీరాజ్ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రాచారి చేతుల మీదుగా కూడలి అరుణ దశరథకి అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

సిఎం జగన్‌తో మనసం వెంకట్రావు

వైసిపి మండల అధ్యక్షుడిగా మసనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి శింగరాయకొండ మండల అధ్యక్షుడిగా మసనం వెంకట్రావు నియ మితులయ్యారు. ఈ మేరకు వైసిపి అధిష్టానం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు వెంకట్రావుకు అభినందనలు తెలిపారు. తన నియమానికి కృషి చేసిన వైఎస్. జగన్మోహన్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, శింగరాయకొండ వైసిపి నాయకులకు ఈ సందర్భంగా వెంకటరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 వరకూ పెన్షన్ పొందుతూ ఉండి ఎవరైనా భర్త చనిపోయి ఉంటే వారి భార్యకు స్పౌజ్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ బ్రహ్మయ్య తెలిపారు. అర్హత కలిగిన వారు తమ పరిధిలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'స్మార్ట్ జన్'లో ఘనంగా వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని స్మార్ట్ జన్‌గ్లోబల్ స్కూల్‌లో అసెండ్-2025 వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ లలిత అధ్యక్షతన నిర్వహించిన ఈ సెలబ్రేషన్స్‌కు ముఖ్య అతిథిగా రాష్ట్ర మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సతీమణి దామచర్ల జయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచులను అర్థం చేసుకొని ప్రోత్సహించి ఉన్నత స్థితికి చేర్చాలన్నారు. శింగరాయకొండ పరిసర ప్రాంతాలలో ఉన్నత విలువలు కలిగి, క్రమశిక్షణతో విద్యార్థులలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇక్కడ స్మార్ట్‌జన్ స్కూల్‌ను స్థాపించడం ఈ ప్రాంత ప్రజల అదష్టమని తెలిపారు. ఈ సందర్భంగా స్మార్ట్ జన్ స్కూల్ వ్యవస్థాపక యాజమాన్యాన్ని అభినందించారు. స్మార్ట్ జన్ గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ గీతా రాణి మాట్లాడుతూ.ప్రతి విద్యార్థిలో అనేక నైపుణ్యాలు ఉంటాయని, ఆనైపుణ్యాలను వికశింపజేసి,వారిని సమాజాభివద్ధికి దోహదపడే లా చేయడమే అసలైన విద్యా లక్ష్యమని తెలిపారు. తల్లిదండ్రులు తాము ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం పిల్లలపై ఒత్తిడి పెంచి వారిని తిరోగమనం వైపు వెళ్లేందుకు దోహదపడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి విధానాల ద్వారా విద్యార్థి పురోగమనం వైపు పయనించలేడని డాక్టర్ గీతా రాణి పేర్కొన్నారు. గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూల్ ప్రారంభించిన అతి కొద్ది కాలంలోనే తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి మంచి ఆదరణ లభించిందని దానికి తాము రుణపడి ఉన్నామని తెలిపారు. ముందు ముందు కూడా పేరెంట్స్ ఇలాంటి ఆదరణ అందిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.పిఎన్‌సిఎ కాలేజీ మరియు స్మార్ట్ జన్ కాలేజి ప్రిన్సిపల్స్ డి నాగేశ్వరావు తమ సందేశాలనంతరం విద్యార్థిని విద్యార్థులు సాంస్కతిక కళారూపాలను అద్భుతంగా ప్రదర్శించారు. బాల బాలికల అద్భుత ప్రదర్శనలను ప్రేక్షకులు ఎంతో ఆనందంగా ఆస్వాదించారు. బాలబాలికలతో పాటు వారి తల్లులు కూడా వేదికపై నత్యాలను ప్రదర్శించటం అద్భుత పరిణామంగా చెప్పవచ్చు. పిల్లల ఎదుగుదలకు తల్లుల పాత్ర ఏమిటో సభికులకు నత్యం ద్వారా తెలియజేశారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దామచర్ల జయలక్ష్మి

నాటికల్లో సందేశం ఆచరణాత్మకం

◆ ఆకట్టుకుంటున్న నాటికల పోటీలు

జనరల్ బోగీ నాటికలో సన్నివేశం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నాటికల్లో సందేశాన్ని అందరూ ఆచరించాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆకుల వెంకట బాబురావు కోరారు. శ్రీకారం, రోటరీ కళాపరిషత్ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు రెండో రోజు ఆసక్తిగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్న సినిమా, టివి సీరియళ్ళలో కేవలం నటన మాత్రమే ఉంటుందని, నిజ జీవితంలో జరిగే వాస్తవాలను కళ్ళకు కట్టినట్లుగా చూపడం ఒక్క నాటికల్లోనే సాధ్యపడుతుందని అన్నారు. ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని గ్రామీణ ప్రాంతంలో శ్రీకారం, రోటరీ కళా పరిషత్ ద్వారా సమాజంలో సామాజిక బాధ్యతను పెంచడానికి రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు నిర్వహించడం అభినంద నీయమని అన్నారు. అనంతరం ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి మోహనరావు మాట్లాడుతూ కళను ఆయుదంగా చేసుకొని సామాజిక ఇతివృత్తంతో ప్రజలకు అవగాహన కల్పించి సామాజిక బాధ్యత పెంచాలన్న లక్ష్యంతో గత 15ఏళ్లుగా నాటికల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీక్షకులు నాటికల్లో ఉన్న నీతి సందేశాలను గ్రహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో గోపరాజు విజయ్ దర్శకత్వంలో పిటి మాధవ్ రచించిన 'జనరల్ బోగీలు' నాటిక రైల్లో జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి కష్టాలు కంటికి కట్టినట్లుగా కళాకారులు ప్రదర్శించారు. దీనిపై ఓ మహిళ ఉత్తరాల ఉద్యమం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరిని ఆలోచింపచేసింది. విశాఖపట్నం శ్రీ చైతన్య కళాస్రవంతి స్టీల్ ప్లాంటు ఆధ్వర్యంలో బాలాజీ నాయక్ దర్శకత్వంలో పిన్నమనేని మృత్యుంజయారావు రచించిన '(అ) సత్యం' నాటిక కంటికి కనిపించేదంతా సత్యం కాదు, కనిపించనిదంతా అసత్యం కాదు, యాదార్ధమైన సరే ఒక చెడుకు దోహదపడితే అది అసత్యం, అబద్ధమైన సరే అది ఒక మంచి పనికి దోహదపడితే ఆది సత్యం అనే సందేశంతో ప్రదర్శించిన నాటిక ఆద్యంతం ఆలోచింపచేసింది. వీరన్నపాలెం కళానికేతన్ ఆధ్వర్యంలో వైబి చౌదరి దర్శకత్వంలో ఆగస్త్య రచించిన 'ఋతువులేని కాలం' నాటికలో నాగరికత సృష్టించిన గజి బిజీ గందరగోళంలో చిక్కుకుపోయిన కోడలు, తనను రక్షించి కుటుంబ బంధాల విలువను తెలియజేసే అత్త 'కాలం ఋతువు'లో భద్రంగా ఉన్నట్లే మనిషి బంధాల మధ్య రక్షణతో ఉంటాడని తెలియజేసే నాటిక ప్రతి కుటుంబంలో జరిగే సమస్యలను చూపుతూ కళాకారులు ప్రదర్శించడం ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసింది. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, ఎలక్ట్ అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, శానంపూడి లక్ష్మయ్య, పోక్సో కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు, చెరుకూరి అంజిబాబు, ఈశ్వరప్రసాద్, ఖాజా హుస్సేన్, తాళ్లూరి సాంబశివరావు, ఖాజారావు పాల్గొన్నారు.

నేడు ప్రదర్శించే నాటికలు

శనివారం రాత్రి హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ ఆధ్వర్యంలో బిఎం రెడ్డి దర్శకత్వంలో పి శివరాం రచించిన 'స్వేచ్ఛ', తాడేపల్లి అరవింద ఆర్ట్స్ సమర్పణలో గంగోత్రి సాయి దర్శకత్వంలో వల్లూరు శివప్రసాద్ రచించిన 'విడాకులు కావాలి', విజయవాడ శ్రీ మైత్రి కళానిలయం ఆధ్వర్యంలో టివి పురుషోత్తం దర్శకత్వంలో స్నిగ్ధ రచించిన 'బ్రహ్మస్వరూపం' నాటికలు ప్రదర్శించనున్నారు.

రుతువు లేని కాలం నాటికలో సన్నివేశం

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

28న పొగాకు రైతుల సదస్సు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈనెల 28న నియోజకవర్గ కేంద్రమైన పర్చూరు తోపాటు ఇంకొల్లులో పొగాకు రైతుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామ కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి సిహెచ్ గంగయ్య తెలిపారు. పర్చూరులో ఉదయం 10 గంటలకు అద్దంకి నాంచారమ్మ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంకొల్లులో సాయంత్రం బాలికోతన్న పాఠశాల వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, మాజీ మంత్రి వడ్డే శోభనాధేశ్వరరావు, నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్రావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కెవివి ప్రసాద్, రైతు సంఘం నాయకులు వి రామారావు హాజరవుతారని తెలిపారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలతో పాటు నల్లబెల్లి పొగాకు సాగుచేసిన రైతులు, కౌలురైతులు హాజరు కావాలని కోరారు.

ప్రజా వేదికలో వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ, అధికారులు

ప్రజా ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ నందు పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ శుక్రవారం ఏర్పాటు చేశారు. శాసన సభ్యులు నక్క ఆనంద్ బాబు ప్రజలనుండి వినతులు స్వీకరించారు. మండలంలోని అనేక మంది గ్రీవెన్స్లో సమస్యలను వివరించారు. స్పందించిన ఎంఎల్ఎ వెంటనే సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ ఎన్ నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థిని సజ్జా దివ్యశ్రీని సత్కరిస్తున్న కలెక్టర్ జెవి మురళి

విద్యార్థినికి ఘన సత్కారం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లి జెడ్పి హైస్కూలుకు చెందిన సజ్జా దివ్యశ్రీ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 596 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమని కలెక్టర్ జెవి మురళి పేర్కొన్నారు. ఆమెను ప్రశంసా పత్రం, రూ.5వేల నగదు ప్రోత్సాహం ఇచ్చి శాలువాతో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని దివ్యశ్రీని తన లక్ష్యమేమని అడగగా హైదరాబాద్ ఐఐఐటిలో కంప్యూటర్ సైన్సు సీటు సాధించడమని తెలిపారు. కార్యక్రమంలో డిఈఓ ఐ పురుషోత్తం, పందిళ్ళపల్లి హైస్కూల్ హెచ్ఎం ఎం శేఖరరావు, విశ్రాంత హెచ్ఎం బి వెంకటేశ్వర్లు, విద్యార్థిని తండ్రి రామకృష్ణ, సిహెచ్ భవానీ దేవి, బుద్ధి మోహనరావు, గుంటూరు శివశంకర్, ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఊటుకూరు శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి రొండా దశరధరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాముడు పాల్గొన్నారు.

మహిళా సాధికారికతకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - పర్చూరు

మహిళలకు ఆర్థిక స్వావలంబన, సాధికారికకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. స్థానిక యూపీ పాఠశాల్లో ఏర్పాటు చేసిన మహిళల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను మహిళలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన అనంతరం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లను పంపిణీ చేస్తుందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలు తమ గ్రామాల్లోని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. శిక్షణ నేర్చుకుంటున్న మహిళలతో ఫోటో దిగారు. నిర్మాణంలో ఉన్న మసీదు ప్రాణదాన్ని పరిశీలించారు. ఆర్థిక చేయూతను అందించాలని, మసీదు నిర్మాణానికి తన వంతు సహాకారాలు అందిస్తానని చెప్పారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. చీరాల రోడ్డులోని వైఆర్ హై స్కూల్ ఎదురుగా నిర్మించిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అందుబాటులోకి రానున్నదని పేర్కొన్నారు. తిమ్మరాజుపాలెం కాలనీలో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు బ్రహ్మయ్య, ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్, ఇఓపిఆర్డి కె సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి మస్తానరావు, షేక్ షంశుద్ధిన్, షేక్ హుస్సేన్, షేక్ గౌస్ బాషా, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ ఉచిత శిక్షణ ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి

అవార్డు అందుకుంటున్న సర్పంచ్ జయలక్ష్మి

అవార్డు అందుకున్న సర్పంచ్ జయలక్ష్మి

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని సూదివారిపాలెంకు చెందిన సర్పంచ్ గోరంట్ల జయలక్ష్మి కేంద్ర జల శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగైన సేవలు అందించినందుకు స్వచ్ఛ లీడర్షిప్ అవార్డు అందుకున్నారు. ఢిల్లీలో పంచాయతీ రాజ్ దివస్ సెలబ్రేషన్ సందర్భంగా కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఢిల్లీలో జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న సర్పంచ్ విజయలక్ష్మికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

భీమా చెక్కు అందజేస్తున్న ఎపిజిబి మేనేజర్ శినానాయక్

బీమా పథకాల్లో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - బల్లికురవ

ప్రతి ఖాతాదారుడు బీమా పథకాల్లో భాగస్వామి కావాలని, తద్వారా వారి కుటుంబానికి భరోసా కల్పించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ కె శినా నాయక్ అన్నారు. స్థానిక బ్యాంకు ఆవరణలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏసురత్నం సతీమణి పాలపర్తి అంజమ్మకు రూ.2లక్షల బీమా చెక్కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నుపల్లి గ్రామానికి చెందిన ఏసురత్నం తమ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో చేరి ఉన్నారని అన్నారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందటం ద్వారా ఆయన కుటుంబ సభ్యులకు బీమా దక్కిందని అన్నారు. ప్రతి ఖాతా దారుడు బ్యాంకులోని బీమా పథకాలలో చేరడం ద్వారా అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు కుటుంబానికి భరోసా కల్పించడానికి ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సిహెచ్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్ సుహిత గ్రేస్, బిందు మాధవి పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ

సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - కొల్లూరు

సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శుక్రవారం నిరసన ర్యాలి నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, మండల కార్యదర్శి వి వెంకటరామయ్య మాట్లాడారు. ఉగ్రవాదులు దాడిని యావత్ మానవ సమాజం ఖండించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి సమగ్ర దర్యాప్తు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బోనిగల సుబ్బారావు, ఆటో యూనియన్ నాయకులు దాసు, నాగరాజు, శ్రీను, సురేంద్ర పాల్గొన్నారు.

బాపట్ల : ఉగ్ర దాడికి నిరసనగా జిల్లా సమాజ్ వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, ఖలీలుద్దీన్, మేకతోటి శరత్, ఐజాక్, ప్రవీణ్, ఎల్ఐసి ప్రసాదరావు, గొర్ల ఏడుకొండలు, షేక్ ఇలియాస్, బోయిన సూరి బాబు, వడ్లమూడి వెంకట భాస్కరరావు, ఎర్రాకుల వాసు, దర్శి భాస్కరరావు, కె ఫణికుమార్ పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుల వేజెండ్ల శ్రీనివాసరావు, బత్తుల సురేష్, బండ్రెడ్డి గోపి పాల్గొన్నారు.

సమాజ్ వాది పార్టీ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి
5
శనివారం 26 ఏప్రిల్ 2025

ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటోను అందజేస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

వికలాంగుడికి ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటో అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యర్రగొండపాలెం మండలానికి చెందిన వికలాంగుడు వెన్న వెంకట్‌రెడ్డికి వారి జీవనాధారం కోసం ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటో ఇవ్వాలని సిఎం చంద్రబాబునాయుడు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సదరు ఆదేశాలను అనుసరించి కలెక్టర్ తమీమ్అన్సారియా గనుల శాఖ, వికలాంగుల శాఖ సమన్వయంతో సదర ఆటోను కొనుగోలు చేసి, లబ్ధిదారుడికి కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గనుల శాఖ ఏడి రవివర్మ, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జి.అర్చన, ముఖ్య ప్రణాళిక అధికారి, సమాచార సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్

హాస్టళ్లలో చేరేలా విద్యార్థులను ప్రోత్సహించాలి..

డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్ సూచించారు. శుక్రవారం నాడు స్థానిక అంబేద్కర్ భవన్ లో జిల్లా లోని అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్స్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్,హాస్టళ్ళ సిబ్బంది సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కాలేజీలలో చేర్చడానికి ప్రోత్సహించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులు హాస్టళ్లలో చేరేందుకు గ్రామాల్లోని తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా లోని అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్స్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, హాస్టళ్ళ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాజీవ్ మాల్యాద్రి కాశిరెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలువురికి రాష్ట్ర స్థాయి పలువురికి పదవులు కట్టబెట్టింది. 14 మందిని 'రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించింది. వారిలో ప్రకాశం జిల్లాకు చెందిన ముగ్గురుకు రాష్ట్ర స్థాయి పదవులు కేటాయించింది. ఈ ముగ్గురికి 'రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు' గా నియమిస్తూ శుక్రవారం నాడు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకు చెందిన పాలడుగు రాజీవ్, పామూరు మండలం చింతలపాలెంకు చెందిన కేతు మాల్యాద్రిరెడ్డి, బేస్తవారిపేట మండలం చెట్టిచర్లకు చెందిన మాచర్ల కాశిరెడ్డి ఉన్నారు. రాజీవ్ గతంలో 'ప్రకాశం జిల్లా జెఎసి కో ఆర్డినేటర్' గా (సచివాలయ విభాగల కో ఆర్డినేటర్) పనిచేశారు.

మురుగునీటిలోకి ఆయిల్‌బాల్స్ వదులుతున్న మేయర్, కమిషనర్

మలేరియాను నియంత్రించేందుకు కృషి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మలేరియాను నియంత్రించేందుకు అధికారులతో పాటు ప్రజలు కూడా కృషి చేయాలని నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. మలేరియా దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రగతి కాలనీలో మురుగు కాల్వలు, డ్రైన్లలో ఆయిల్‌బాల్స్ వేయడం, యాంటి లార్వా స్ప్రే పిచికారీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, అధికారులు పాల్గొన్నారు.

'వక్ఫ్ సవరణ చట్టం' రద్దు కోసం

ఐక్య ఉద్యమం

- ప్రజాసంఘాల సమావేశం తీర్మానం
- ఒంగోలులో 28న ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మైనారిటీల హక్కులను కాలరాసే 'వక్ఫ్ సవరణ చట్టాన్ని' తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎండి యాసిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలు ఎల్బీజీ భవన్‌లో కేంద్రం తెచ్చిన 'వక్ఫ్ సవరణ చట్టం రద్దు' ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ మైనారిటీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 'వక్ఫ్ సవరణ చట్టాన్ని ' తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకునేంతవరకు జరిగే పోరాటాలలో కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ మద్దతుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 28న అన్ని ప్రజా సంఘాలు ర్యాలీలో పాల్గొనాలని సమావేశంలో తీర్మానించారు. సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ అమీర్, ప్రజాసంఘాల నాయకులు ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి, వినోద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యాసిన్

గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తా..

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రజాసమస్యల పరిష్కార వేదికను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు, విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతి నాలుగో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, స్టువర్టుపురం ప్రాంతాలలో లోఓల్టేజ్ సమస్య వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయని సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ విద్యుత్ శాఖ అధికారులకు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. బాపట్ల మండలం అడవి పంచాయతీ, యానాది కాలనీలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్ దిబోరా, జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివలీల, గహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకష్ణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్ పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకట మురళి

పొదుపు మహిళల

జీవనోపాధుల వృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పొదుపు మహిళల జీవనోపాదుల వద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి కోరారు. పొదుపు మహిళల జీవనోపాధుల వద్ధిపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. పొదుపు మహిళలను లక్షాధికారులను చేయడమే అధికారుల లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 3.39 లక్షల మంది పొదుపు మహిళలు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నారన్నారు. వారి ఆర్థిక స్థితిగతులు మార్చాలన్నారు. ఇందుకోసం 59,812 మంది మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలన్నారు. ఆయా పథకాల ద్వారా రాయితీ రుణాలు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఏ పి డి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

తుపాన్లు వచ్చినప్పుడు.. ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో వరదలు, తుపాన్లు వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో తుపాన్లు, వరదలు వచ్చినప్పుడు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో దక్షిణ, పశ్చిమ, రుతు పవనాలు వీస్తాయనే భారతీయ వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాల న్నారు. జిల్లాలో ఎక్కువగా కష్ణానది పరివాహక ప్రాంతంలో కరకట్టకు గండ్లు పడే ప్రాంతాలను గుర్తించి అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ జి. గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న డిఆర్ఓ

ఈవిఎం గోదాముల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు స్థానిక మామిడిపాలెంలోని ఈవిఎం గోదాములను తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలలో భాగంగా శుక్రవారం ఈ గోదాములను సందర్శించారు. ఈ ప్రాంగణంలో కల్పిస్తున్న భద్రత, వాటికి సంబంధించి నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించారు. గోదాము షట్టర్లకు వేసిన తాళాలు, వాటి సీలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, ఇతర సిబ్బంది ఉన్నారు.

నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతలు

ఉగ్రవాదుల దాడులను ఖండించండి

ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రకాశం జిల్లా కమిటీలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాలు డిమాండ్ చేశాయి. పహల్గామ్ భయానక ఉగ్రవాద దాడిని ఖండిస్తూ, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శుక్రవారం నాడు ఒంగోలులోని ఎల్బీజీ భవన్ నుండి రంగారాయుడు చెరువు వరకు ర్యాలీ చేపట్టి అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్ మాట్లా డుతూ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఈ దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోటల్‌ను ప్రారంభిస్తున్న మండవ మురళీకృష్ణ

వికలాంగురాలి జీవనోపాధికి చేయూత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వికలాంగురాలు నాగలక్ష్మి జీవనోపాధికి సూర్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూతనిందించారు. ట్రస్టు ద్వారా దాతల సహకారంతో అందించిన రూ.1.05 లక్షలతో నాగలక్ష్మి ఒంగోలు, ప్రకాశం భవనం వద్ద.. అంబేద్కర్ భవన్ రోడ్డులో టిఫిన్ హోటల్ ఏర్పాటుచేశారు. ఈ టిఫిన్ హోటల్‌ను సూర్యశ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకష్ణ శుక్రవారం ప్రారంభించారు. ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ భాష మాట్లాడుతూ నాగమణికి ఒక కాలు లేదని.. ఇద్దరు పిల్లలనూ పోషించలేక.. ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని చెప్పారు. తమ ట్రస్టు ద్వారా దాతలు ఇచ్చిన రూ.1.05 లక్షలతో టిఫిన్ హోటల్ ఏర్పాటుచేసుకుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ట్రస్ట్ చైర్ పర్సన్ షేక్ షహనాజ్., సినీ నటులు దన్నారపు మస్తాన్రావు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

మైనారిటీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మైనారిటీ డీఎస్సీ అభ్యర్థులకు బాపట్ల శ్రీ భావపురి విద్యాసంస్థలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్ మెంట్ ఆఫ్ మైనారిటీస్ ద్వారా ముస్లిం, క్రిస్టియన్ (బీసీ సీ), నూర్‌బాషా లేదా దూదేకుల, సిక్కు, బౌద్ధ, జైన మరియు పారశీక వంటి మైనారిటీ అభ్యర్థులకు సెకండరీ గ్రేడ్ టీచర్‌లకు 60 రోజులు, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులకు 45 నుండి 50 రోజులు ఉచిత శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. ఈ మేరకు కరపత్రాలను శుక్రవారం కలెక్టర్ వెంకటమురళి ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి2 పరిధిలో భాగ్యనగర్ 4వ లైన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఒంగోలు టౌన్ డిఇఇ కెవి.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఏరియాలోని వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

నివాళులర్పిస్తున్న మంత్రిగొట్టిపాటి ఎమ్మెల్యేలు.

సరస్వతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఇంకొల్లు

చిన్నగంజాం మండలం గొనసపూడి గ్రామానికి చెందిన యువ పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావు నాయనమ్మ సరస్వతమ్మ దశదినకర్మకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాచర్ల, పర్చూరు శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి, ఏలూరు సాంబశివరావుతో కలిసి పాల్గొన్నారు. సర్వసరమ్మ చిత్ర పటానికి పూల వేసి నివాళులు అర్పించారు. విక్రం నారాయణరావు కుటుంబ సభ్యులైన విక్రం వెంకటరావు, సంపూర్ణమ్మ, అజయ్ బాబు, సర్పంచ్ విక్రం దీప్తిని పరామర్శించారు.

వైసిపికి 'కోట' రాజీనామా

ప్రజాశక్తి - అద్దంకి

కోట శ్రీనివాస కుమార్

వైసిపికి చెందిన సీనియర్ నాయకులు కోట శ్రీనివాస కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జునకు తన రాజీనామా లేఖను పంపారు. సింగరకొండ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా, వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్‌గా గతంలో పని చేసి మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. వ్యక్తిగత కారణాలతోనే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సంపూర్ణ సహకారం అందించిన వైసిపి అధిష్టానంకు, కలిసి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణ అభివృద్ధి ఖర్చు ఎంత?

ప్రజాశక్తి - బాపట్ల

పురపాలక సంఘంలో గత ఆరేళ్లలో అభివృద్ధి పనులకు చేసిన ఖర్చుల వివరాలు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని పిట్టలవానిపాలెం మండలంకు చెందిన దేగల రవిరెడ్డి, గోవతోటి విజయ్ సమాచార హక్కు చట్టం ద్వారా కమిషనర్ రఘునాథరెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆరేళ్లలో పురపాల సంఘం జమ ఖర్చులతో పాటు పట్టణ అభివృద్ధికి చేసిన పనుల వివరాలు, అయిన ఖర్చులు, బడ్జెట్ వివరాలు తెలియ చేయాలని కోరారు. పట్టణ అభివృద్ధికి చేసిన ఖర్చుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, మునిసిపల్ నిధులు ఎంత వెచ్చించారనే వివరాలు కోరారు.

భవన నిర్మాణ అనుమతులు సులభం

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేసినట్లు కమిషనర్ బి రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలో భవన నిర్మాణాలకు స్థానిక సంస్థల నుండి అనుమతులు సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నూతన జిఒ ప్రకారం స్వీయ ధ్రువీకరణ తోబాటు లైసెన్స్ పొందిన టెకినికల్ సర్వేయర్ లేదా ఇంజనీర్ ద్వారా అనుమతించబడునని చెప్పారు. ఐటిఐ సివిల్, డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్ పూర్తి చేసిన వాళ్ల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సూర్యలంక రోడ్డులో కారు దగ్ధం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల, సూర్యలంక రోడ్డులో పూర్తిగా దగ్ధమైందని అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వరరావు తెలిపారు. స్కోడా కంపెనీకి చెందిన ఏపి16డిఎల్1216 నెంబర్ గల కారు సూర్యలంక వైపు నుండి బాపట్లకు వస్తున్న సమయంలో కారు బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైనట్లు చెప్పారు. అక్కడ స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు కారులో మంటలు చెల రేగేసరికి కారులో నుంచి దిగి వెళ్లిపోయారని తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉందని అగ్నిమాపక అధికారి తెలిపారు. తగలబడుతున్న కారు మంటలు ఆర్పినట్లు తెలిపారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

సమావేశంలో సిఐటియు అధ్యక్షులు సిహెచ్ మణిలాల్

హైర్ బస్ డ్రైవర్లకు రాష్ట్ర వ్యాప్తంగా ఐడి కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్ల సమస్యలపై డిపో మేనేజర్ సునీల్ కుమార్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్స్ అందరికీ ప్రభుత్వం భద్రత కల్పించే విధంగా ఐడి కార్డులు, పిఎఫ్, బస్ పాస్, ఈఎస్ఐ వంటివి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో మదర్ తెరిసా హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ డిపో సహాయ కార్యదర్శి కె వెంకట నాగగోపి, కోశాధికారి రవికుమార్, ఎస్‌కె ఇమ్రాన్ పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి : ఏలూరి

ప్రజాశక్తి - పర్చూరు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

రైతుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులకు రాయితీపై రూ.1.31కోట్ల విలువైన యంత్ర పరికరాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లుగా వ్యవసాయాన్ని, రైతులను నిర్లక్ష్యానికి గురిచేసిందని చెప్పారు. సాగునీరు అందించడంలో వైఫల్యం చెందిందని చెప్పారు. ఎత్తిపోతల పథకాలు పట్టించు కోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం ఎత్తిపోతల పథకాలు వినియోగంలోకి తీసుకురావడానికి రిటైర్డ్ ఇంజనీరుతో కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తయారు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 55 ఎత్తిపోత పదకాలు రానున్న కాలంలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎత్తిపోతల పథకాల నిర్వాణ బాధ్యతలు రైతు సంఘాలకు ఇవ్వనున్నట్లు చెప్పారు. పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారని అన్నారు. పొగాకు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళామని, రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. పొగాకు కంపెనీల యాజమాన్యంతో మాట్లాడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే నాగార్జునసాగర్ కుడి కాలువ, కొమ్మమూరు కెనాల్‌కు నీరు సమృద్ధిగా వస్తుందని చెప్పారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు రూ.75 కోట్లు విడుదల చేసిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆనంద కుమారి, ఎడిఎ మోహనరావు, ఎఒ రామ్మోహన్‌రెడ్డి, తహశీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడిఓ ప్రద్యుమ్నకుమార్, ఎఎంసి చైర్మన్ గుంజి వెంకట్రావు, షేక్ షంషుద్దీన్, శ్రీహరి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

ప్రజాశక్తి - చీరాల

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు (సిఎంఆర్‌ఎఫ్) వరమని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 16 మంది లబ్ధిదారులకు వైద ఖర్చుల నిమిత్తం రూ.25.83 లక్షల విలువైన చెక్కులు ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రాణాలను కాపాడటంలో సీఎంఆర్‌ఎఫ్ కీలక పాత్ర పోషించిందని అన్నారు. కుటుంబ పెద్ద అనారోగ్యం పాలైతే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని అన్నారు. ఈ సహాయ నిధి సకాలంలో ఆదుకోవడం వల్ల కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకు పోకుండా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల్లో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని, మెరుగైన వైద్యం నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందిన బాధితులకు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధనరావు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పంగులూరు

మాట్లాడుతున్న ఎంపిడిఒ కెస్వరూపరాణి

ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలు ప్రోత్సహించి రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేయాలని ఎంపిడిఒ కె స్వరూపరాణి అన్నారు. స్థానిక ఎంపిడిఒ సమావేశ మందిరంలో జరిగిన ఉపాధి హామీ పథకం, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ సంయుక్త సమావేశంలో శుక్రవారం నిర్వహించారు. రైతుల పొలాలు బీడు భూములుగా ఉంటే వారికి ఉద్యానవనాలను ఉపాధి హామీ పథకం ద్వారా ఇస్తారని, ఐదెకకరాల లోపు భూమి ఉన్న చిన్న సన్నగా రైతులకు మామిడి, జామ, సపోటా, సీతాఫలం, కొబ్బరి, పెద్దరేగిపళ్ళు మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి మొక్కలు సాగు చేయడానికి ఉద్యాన పథకం ద్వారా అవకాశం కల్పిస్తుందని అన్నారు. ఎపిఒ కె సంతోషం మాట్లాడుతూ ఈ ఏడాది 250 ఎకరాల ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎఒ బి సుబ్బారెడ్డి, ఎస్ దీప్తి, ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, జూనియర్ ఇంజనీర్ నాగరాజు పాల్గొన్నారు.

మలేరియా దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పంగులూరు

దోమల నివారణతో మలేరియా, చికెన్ గున్యా, బోధకాలు, డెంగ్యూ జ్వరాలు నివారించవచ్చని స్థానిక పిహెచ్‌సి డాక్టర్ శివ చెన్నయ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మలేరియా పట్ల అవగాహన కల్పించారు. మలేరియా నివారణకు ప్రజలు నీరు నిలువ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ బాల రాజేశ్వరి, సిహెచ్‌ఓ భారతి, హెల్త్ ఎడ్యుకేట్ అనురాధ, ల్యాబ్ టెక్నీషియన్ హరిచందన, ఫార్మసిస్ట్ పద్మావతి, స్టాఫ్ నర్స్ క్రాంతి, రాజారెడ్డి, సూపర్వైజర్ రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు రామాంజమ్మ, మంగమ్మ, మాణిక్యం, ఎస్తేరు రాణి, లలిత, జయమ్మ, శకుంతల, శ్రావణి, రేణుక, మరియమ్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

చీరాల : మలేరియా నివారణ అందరి బాధ్యతని పిపిపి యూనిట్ వైద్యాదికారి డాక్టర్ యాకోబు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ వీర బ్రహ్మంతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చింతా శేషుబాబు, సూపర్వైజర్ రవి కుమార్, వసంత వల్లి, బీబేమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

బాపట్ల : దోమల నిర్మూలనతోనే మలేరియా వ్యాధిని అంతం చేయ వచ్చని మలేరియా జిల్లా అధికారి గోపీనాథ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యాలయం నుండి బయలుదేరిన ర్యాలీ పట్టణంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కళ్యాణ్, త్రివేణి, మౌనిక, ఎస్‌కె కదీర్, షకీల్, జె రాంబాబు, సుధారాణి, ఎస్‌కె జిలాని, కె సత్యం రాజు పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి గ్రామంలో ప్రపంచ మలేరియా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం డాక్టర్ శ్రీహర్ష ఆధ్వర్యంలో మలేరియా అంతం మనతోనే అనే నినాదతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో హెల్త్ ఆఫీసర్ విజయచంద్ర, శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు అందరిలో మార్పు వస్తేనే మలేరియా అంతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ప్రసాద్, హెచ్‌ఇఒ వెంకటేశ్వరరెడ్డి, సూపర్ వైజర్లు సునంద, పెర్సీ, హెచ్‌ఎ కోటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్పిలు, ఎఎన్‌ఎంలు నాగరాణి, సులోచన, లక్ష్మి, జాన్బి పాల్గొన్నారు.

అవగాహనా కల్పిస్తున్న శక్తి టీం ఎస్ఐ హరిబాబు

మహిళలకు అండగా శక్తి యాప్

ప్రజాశక్తి- చీరాల

మహిళలు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీసు సహాయం పొందేందుకు శక్తి యాప్ రూపొందించినట్లు శక్తి టీం ఎస్ఐ హరిబాబు అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఎఎస్పీ టిపి విఠలేశ్వర్ సూచనలతో డిఎస్పీ మోయిన్ పర్యవేక్షణలో సబ్ డివిజన్ శక్తి బృందం శుక్రవారం పట్టణంలోని కెఎస్‌ఆర్ హ్యాంలూమ్స్ నందు విధులు నిర్వహిస్తున్న మహిళలకు శక్తి యాప్ ఆవశ్యకత వివరించి వారి ఫోన్లలో యాప్‌ను నిక్షిప్తం చేశారు. యాప్ వినియోగించే విధానం వివరించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు శక్తి యాప్‌లో 'సేఫ్ ట్రావెల్' ఆప్షన్ ఎంచుకుంటే ధీమాగా, ధైర్యంగా, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. యాప్ నిక్షిప్తం చేసుకొని సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శివకుమారి, లోకేష్, సుబ్బారావు సునీత, ధనలక్ష్మి, కెఎస్‌ఆర్ హ్యాంలూమ్స్ యాజమాన్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న చిన్నారి అమూల్య

గిన్నిస్ రికార్డులో రేపల్లె చిన్నారి

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని 5వ వార్డుకు చెందిన చిన్నారి ఆలా అమూల్య మ్యూజికల్ కీబోర్డ్ ఇన్స్ట్రుమెంట్లో ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు ఆధ్వర్యంలో హెలెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు దండింగి ఆగస్టిన్ వేణు గోపాల్ నేతృత్వంలో విజయవాడలో గిన్నిస్ రికార్డు సాధన సమ్మేళనం నిర్వహించారు. రేపల్లెకు చెందిన ఆలా మోషే లావణ్యల ద్వితీయ పుత్రిక చిన్నారి అలా అమూల్య 12ఏళ్లకే గిన్నిస్ రికార్డు సాధించారు. నేతాజీ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థి ఎలక్ట్రానిక్ కీబోర్డ్ మ్యూజిక్లో ప్రతిభ కనబర్చారు. 18 దేశాల నుండి ఒకే సామాజిక మాధ్యమం వేదికగా 1078 మంది ఎలక్ట్రానిక్ మ్యూజికల్ కీబోర్డ్ వాయిద్య కారులు పాల్గొని రికార్డు సృష్టించారు. హెలెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు దండింగి ఆగస్టిన్ ఆధ్వర్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రంను ఆమెకు అందజేశారు.

పోక్సో కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

మాజీ ఎంపీపీ, వైసీపీ నేత గవిని శ్రీనివాస్ యాదవ్పై 2వ పట్టణ పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. ఆయనను శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు. మండలంంలోని గమనివారిపాలెంకు చెందిన పిట్టు శివ నాగరాజు అనే యువకుడు పట్టణంలోని సంపత్ నగర్ కాల నీ మూడు రోడ్ల కూడలిలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో ఓ మైనర్ బాలిక తల్లి, దండ్రులు నిర్వహిస్తున్న హెూటల్ వద్దకు టిఫిన్ కోసం వెళ్లి మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆ యువకుడి మాయమా టలకు ఆకర్షితురాలైన బాలికను ఈనెల 17న ఇంటి నుండి తీసుకు వెళ్ళి పోయాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువుల ఇళ్లలో వెతికి 18న 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 19న బాలికను వారి తల్లిదండ్రుల ఇంటి వద్ద వదిలి వెళ్ళిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు శివ నాగరాజును అదుపులోకి విచారించి ఫోక్సో చట్టం పరిధిలో కేసు నమోదు చేసి రిమాండుకు పంపించారు. పోలీసుల విచారణలో గవినివారిపాలెంకు చెందిన చిదరబోయిన శ్రీను, చిదరబోయిన గోపి, మాజీ ఎంపీపీ గవిని శ్రీనివాసరావు వీరి ప్రేమ వ్యవహారంలో పిట్టు శివ నాగరాజుకు సహకరించినట్లు గుర్తించి వారిపై కూడా ఫోక్సో యాక్ట్ నమోదు చేశారు. అయితే కేసు దర్యాప్తులో భాగంగా చీదరబోయిన గోపి, గవిని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరపర్చగా రిమాండు విధించడంతో ఒంగోలుకు తరలించారు. చీదరబోయిన శ్రీను పరారీలో ఉన్నట్లు తెలిసింది. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. రూరల్ సీఐ శేషగిరిరావు విచారణ చేస్తున్నారు.

27న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి.- చెరుకుపల్లి

ఈనెల 27న ఆదివారం ఉచిత వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు జనసేన మండల అధ్యక్షుడు దూళ్ళ సురేష్ శుక్రవారం తెలిపారు. బిగ్ టివి, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిభిరానికి జనసేన రేపల్లె నియోజకవర్గ ఇన్చార్జి మత్తి భాస్కరరావు హాజరవుతారని తెలిపారు. చెరుకుపల్లి మెయిన్ సెంటర్లో నిర్వహించే వైద్య శిభిరంలో వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - అద్దంకి

2023 డిసెంబర్ 1 నుండి 2024 అక్టోబర్ 30 మధ్య చనిపోయిన పెన్షన్ దారుల భార్యలకు మంజూరు వర్తిస్తుందని ఎంపిడిఒ బి సింగయ్య తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో అర్హులైన లబ్దిదారులను గుర్తించి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు పంపాలని వెల్ఫేర్ సహాయకులకు సూచించారు.

యద్దనపూడి : ఎన్టిఆర్ భరోసా పెన్షన్కు దఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ లక్ష్మి నారాయణ తెలిపారు.

విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, నియోజకవర్గం స్థాయిలో ప్రథమ స్థానాన్ని, జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించిన విద్యార్థుల కు శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎంపి డిఒ కార్యాలయంలో ఎంఇఒ నీలం దేవరాజ్ అధ్యక్షతన మండల ప్రథమ స్థానం సాధించిన పెసర్లంక డీకే ఉన్నత పాఠశాల విద్యార్థిని టి సుహిత (594), ద్వితీయ స్థానం సాధించిన పెదపులివర్రు విద్యార్థిని ఎం లక్ష్మీ దుర్గ (589), పెసరలంక ఉన్నత పాఠశాల విద్యార్థిని జి మోహిత (588)ను అభినందించారు. విద్యార్థులతో పాటు వారి తల్లి, దండ్రులకు అభినందనలు తెలిపారు. ఎంపిపి డివి లలిత కుమారి నాగమల్లేశ్వరరావు, జెడ్పి టిసి తిరువీధుల ఉదయ భాస్కరి బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం కార్పొరేటుకు ధీటుగా ఫలితాలు సాధించారని అన్నారు. మండలంలో ఐదు జెడ్పి, రెండు ఏడెడ్ పాఠశాలల్లో

ఉత్తమ ఫలితాల విద్యార్థులకు సన్మానం చేస్తున్న దృశ్యం

ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను దృశ్యాలువాలతో సత్కరించారు. మండలంలో 90 మంది విద్యార్థులు 500పైగా మార్పు సాధించగా 33మంది 550 కంటే ఎక్కువ మార్కులు సాధించారని ఎంఈఓ దేవరాజ్ తెలిపారు. మండలంలో 600మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 531 మంది ఉత్తీర్ణత సాధించి 88.5శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, హెచ్ఎంలు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని జువ్వలపాలెంకు చెందిన తెలుగుదేశం కార్యకర్త కంచర్ల ఏసుబాబు బైకు ప్రమాదంలో మృతి చెందారు. అతను టిడిపి క్రియాశీల సభ్యత్వం తీసుకొనడంతో అతని కుటుంబానికి భరోసాగా రూ.5లక్షల చెక్కును శాసన సభ్యులు నక్క ఆనందబాబు చేతుల మీదగా శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్ పాల్గొన్నారు.

చెక్కును అందజేసిన నక్క ఆనందబాబు

పిల్లల్ని అంగన్వాడీ కేంద్రంలో చేర్చాలి

ప్రజాశక్తి - పర్చూరు

రెండున్నరేళ్లు నిండిన ప్రతిబిడ్డ అంగన్వాడి కేంద్రంకు హాజరు అయ్యే విధంగా అంగన్వాడి కార్యకర్తలు చూడాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి రాధా మాధవి పేర్కొన్నారు. స్థానిక సిడిపిఓ కార్యాలయంలో పర్చూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు హాజరయ్యే పిల్లలకు ఆట, పాటలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు. వేసవిలో తగు జాగ్రత్తలు పాటిస్తూ మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. కాంట్రాక్టర్ అందించే ఫుడ్ స్టాక్స్ నాణ్యత పరిశీలించారు. లబ్ధిదారులకు అందించే విషయంలో ఎటువంటి పొరపాటు జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. పిల్లలకు బరువు, ఎత్తులు సక్రమంగా తూచి రికార్డులో నమోదు చేయాలని అన్నారు. వారి పోషణ స్థితి తల్లులకు తెలియ జేయాలని అన్నారు. మే 2 నుండి జూన్ 10 వరకు కిషోర్ బాలికలకు సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఓ జి సుభద్ర, జిల్లా సమన్వయ కర్త సురేంద్ర, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్

మాట్లాడుతున్న సిడిపిఓ విజయలక్ష్మి

యాప్లపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం మోదుకూరు ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. అమృతలురు ప్రాజెక్టు అధికారిని జి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యాప్ల పట్ల అంగన్ వాడీలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రికార్డుల నమోదు, చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు అందించే పౌష్టికాహార వివరాలను ఎప్పటికప్పుడు యాప్లో నమోదు చేయాలని చెప్పారు. పాఠశాల సమయపాలన పాటించి చిన్నారుల హాజరు శాతాన్ని నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నాగరాజకుమారి పాల్గొన్నారు.

మెప్మాలో అవినీతిపై ప్రజా దర్బార్లో ఫిర్యాదు

మెప్మాలో అవినీతిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ మహిళా సమాఖ్య (మెప్మా)లో రూ.5.30 కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ మహిళా సమాఖ్య సభ్యులు పలువురు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు పిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రెవిన్యూ, రుణాలు, రహదారులు, కాలువలు వంటి సమస్యలపై 11 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు . కార్యక్రమంలో గొలపల శ్రీనివాసరావు, ఫిర్యాదు దారులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని

పి4 ద్వారా ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పి4 ద్వారా 2038 కుటుంబాలకు బంగారు భవిష్యత్తు కలుగుతుందని ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న పి4 ద్వారా గత నెలలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో 2038 కుటుంబాలు లబ్ధి పొందేందుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కుటుంబాల అవసరాలు గుర్తించి, వారి స్థితిగతులు మెరుగుపర్చడానికి ప్రతి ఐదు కుటుంబాలకు ఒక మార్గదర్శిని ఎంపిక చేయాలని అధికారులను కోరారు. మార్గదర్శకులు అధికారులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, సేవా భావం కలిగిన ఎవరైనా సరే ఐదు కుటుంబాలను ఎంపిక చేసుకొని వారి స్థితిగతులు మెరుగుపర్చేందుకు ప్రయత్నం చేయాలని తెలిపారు. మండలంలో ఎంపికైన 2038 మంది లబ్ధిదారులకు 410 మంది మార్గదర్శకులను ఎంపిక చేయాలని పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలను ఆదేశించారు. సమావేశంలో తహశీల్దారు సిహెచ్ పద్మావతి పాల్గొన్నారు.

రక్త దాతను అభినందిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - అద్దంకి

రక్త హీనత సమస్యతో బాధ పడుతున్న కొటికలపూడి గ్రామానికి చెందిన మాగులూరి భూలక్ష్మికి అత్యవసరంగా రక్తం అవసరమని వైద్యులు సూచించగా ఆమె బంధువులు రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ మురళీ సుధాకరరావును సంప్రదించారు. స్పందించిన ఆయన నంబూరివారి పాలెం సచివాలయం ఉద్యోగి శివకృష్ణను ప్రోత్సహించి రక్తదానం చేయించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, బాచిన పూర్ణ చంద్రరావు, చిన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన నక్క ఆనందబాబు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని జడ్పీహెచ్ హైస్కూలు పెరేడ్ గ్రౌండ్లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంటును శాసన సభ్యులు నక్కా ఆనందబాబు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా మానవహారం

ప్రజాశక్తి - కొల్లూరు

ఉగ్రవాదుల ఘాతుకాన్ని నిరసిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ స్థానిక బస్టాండ్ సెంటర్లో జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బొందలపాటి చలమయ్య, నాయకులు పాల్గొన్నారు

పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించండి

అధికారులకు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పరిశ్రమల శాఖ అధికారులు ఎపిఐఐసి అధికారులతో సమావేశమై, జిల్లా లో అమలు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సింగిల్ డెస్క్ పాలసీ 2015, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పిఎంఈజిపి), పిఎం విశ్వకర్మ యోజన, ఆంధ్రప్రదేశ్‌లో రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఇ పనితీరు (ర్యాంప్) పథకంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్-కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు (ఈఎస్‌డిపి), ఉద్యమ్ వర్క్ షాప్, ఎంఎస్ఎంఈ సర్వే, ఇన్సెంటివ్ రిలీజ్, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థల సేకరణ వంటి అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువమందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అందుకనుగుణంగా యువతకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో జరుగుచున్న పిఎం విశ్వకర్మ యోజన స్టేజ్ 1 పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కుకు అవసరమైన స్థల సేకరణ, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద సంస్థలను తుద ముట్టించాలి

ఒంగోలులో జనసేన ఆధ్వర్యంలో మానవహారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మానవహారంలో పాల్గొన్న జనసేన నాయకులు, కార్యకర్తలు

దేశంలోని ఉగ్రవాద సంస్థలను ప్రధాని మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం తుది ముట్టించాలని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జమ్ము కాశ్మీర్ లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి ఖండిస్తూ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు చర్చి సెంటర్ వద్ద జన సైనికులు మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రదర్శించిన 300 అడుగుల జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ నేతృత్వంలోని ఉగ్రవాద సంస్థలను దేశం నుంచి తరమికొట్టాలని కోరారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రవిశంకర్ గ్రూప్ అధినేత, ప్రకాశం జిల్లా జనసేన నాయకులు కంది రవిశంకర్ మాట్లాడారు. కార్యక్రమం లో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, రాయని రమేష్, కష్ణ పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలు బొందిల శ్రీదేవి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

మలేరియా నియంత్రణ అందరి బాధ్యత

అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో మలేరియా నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ ఒంగోలు కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఏటా ఏప్రిల్ 25 న మలేరియా నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది మలేరియా నివారణ మనందరి బాధ్యత అన్న నినాదంతో జరుపుతున్నామన్నారు. మలేరియా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. మలేరియా వ్యాధి నిర్ధారణ, సకాలంలో చికిత్స వంటి వాటితో నియంత్రించవచ్చన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ సౌకర్యాలు, చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయన్నారు. ర్యాలీ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మధుసూదన్ రావు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- మే 31 నాటికి 8,839 నిర్మాణాలు పూర్తి
- 90 రోజుల పనిదినాలు అందేలా చర్యలు
- అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా జూన్ నెలలో మూడు లక్షల గృహాలకు సాముహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారని, అందులో భాగంగా జిల్లాకు కేటాయించిన 8,839 ఇళ్ల నిర్మాణాలు మే 31 నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు గృహనిర్మాణ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 2,824 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తి చేసి.. 32 శాతం మేర లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇంకా 6,015 ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ అసంతప్తి వ్యక్తం చేస్తూ, స్టేజి కన్వర్షన్‌పై రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఇళ్ళ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న మండలాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేశించిన సమయంలో లక్ష్యాలను సాధించే దిశగా కషి చేయాలన్నారు. ముఖ్యంగా రూఫ్ లెవల్, రూఫ్ కాస్ట్ స్టేజ్‌లోని ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దష్టి సారించి.. అవి త్వరగా పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సిలు, ఎస్‌టిలు, వెనుక బడిన తరగతులకు చెందిన లబ్ధిదారులకు అందించే అదనపు ఆర్థిక సహాయంపై అవగాహన కలిగించి, ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జన్‌మన్ కార్యక్రమంలో చేపట్టే గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా సంబంధిత మండల అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు అందిస్తున్న 90 రోజుల పనిదినాలు ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, మెప్మా పిడి శ్రీహరి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఈఈలు, డిఈలు, ఎఈలు పాల్గొన్నారు.

పాత పద్ధతిలో అదనపు పింఛన్ ఇవ్వాలి

- పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- రెవెన్యూ ఉద్యోగులకు పనితీరుపై శిక్షణ ఇవ్వాలి
- ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు పాత పద్ధతిలో అదనపు పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి జెఏసి అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఒంగోలులోని ఎపిఆర్ఎస్ఏ భవన్‌లో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత చంద్రబాబు నాయుడు పాలనలో విశ్రాంత ఉద్యోగులకు అదనపు పింఛన్‌ను 75 సంవత్సరాలు దాటిన వారికి 17 శాతం, 70 సంవత్సరాలు దాటిన వారికి 10 శాతం ఇచ్చారన్నారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం అదనపు పింఛన్లలో కోత విధించిందన్నారు. 75 సంవత్సరాలు దాటిన వారికి 12 శాతం, 70 సంవత్సరాలు దాటిన వారికి 7 శాతం వంతున కోత విధించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ కష్టాలు తీరుతాయని భావించిన విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి తీపి కబురు చెప్పలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 75 సంవత్సరాల దాటిన విశ్రాంత ఉద్యోగులకు 17 శాతం, 70 సంవత్సరాలు దాటిన వారికి 12 శాతం వంతున అదనపు పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుండి రావలసిన అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వంతో కలిసి పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించి మంచి పేరు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు తగిన సమయం, శిక్షణ, నిధులు కేటాయించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కషి చేయాలని కోరారు. సమావేశానికి ముందుగా జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద భారతీయ పర్యాటకులపై ముష్కరుల దాడిని ఖండించారు. భారత ప్రభుత్వం దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై కఠినమైన చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామన్నారు. దాడిలో మతిచెందిన భారతీయ పర్యాటకులకు ఘనంగా నివాళు లర్పించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక మధుసూదన్‌రావు, కార్యదర్శి ఆర్ వాసుదేవరావు, కోశాధికారి ఊతకోలు శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అలసత్వం వహిస్తే చర్యలు

అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉపాధి హామీలో చేపట్టిన పనుల పురోగతి అమలుపై అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ డ్వామా అధికారులు, ఎంపిడిఒలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేపట్టడానికి వేసవి కాలం అనుకూలం కావటంతో పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉపాధి హామీ పథకాల కింద చేపట్టిన పనుల పురోగతి సాధించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల పురోగతిపై అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. లేబర్ మొబిలైజేషన్ పైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. లేబర్ మొబిలైజేషన్ లో త్రిపురాంతకం, ముండ్లమూరు, తాళ్ళూరు, హెచ్‌ఎంపాడు, గిద్దలూరు మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయని, సంబంధిత ఎంపిడిఓ లు ప్రత్యేక దష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కూలిలకు రోజువారి సగటు వేతనం 307 తగ్గకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పుల్లల చెరువు, పెద్దారవీడు, దోర్నాల, దొనకొండ, పామూరు, జరుగుమల్లి, పిసిపల్లి, తాళ్ళూరు, వై పాలెం, అర్ధవీడు మండలాల్లో గత వారం కంటే ఈ వారం కూలిలకు రోజువారి సగటు వేతనం తగ్గిందన్నారు. ఈ మండలాల్లో సగటు వేతనం తగ్గడానికి ఉన్న కారణాలను కలెక్టర్, సంబంధిత ఎంపిడిఓ లను, ఎపిఓ లను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన కారణాలపై జిల్లా కలెక్టర్ అసంతప్తి వ్యక్తం చేస్తూ, ఉపాధి హామీ పనుల విధుల పట్ల కనీసం అవగాహన లేకపోతే ఎలా పని చేస్తారు, నిబద్ధతతో పనిచేయాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. జోసెఫ్ కుమార్, ఎంపిడిఓలు, ఏపిడిలు, ఎపిఒలు, తదితరులు పాల్గొన్నారు.